# ఎదురుచూసిన ముహూర్తం

పేకముక్కలు విసిరేస్తూ "బోర్ కొడుతోంది" అన్నది ఇందుమతి.

అరటితోటలో చెట్లమధ్య నించి జల్లెడ పడుతున్నట్టు లోపలకు పడుతోంది ఎండ. చెట్ల కిందనించి చూస్తే కొంచెం దూరంలో వున్న పొలాలమీద ఎండ పరచుకున్నట్టుగా వుంది. ఆ ఎండలో చురుకుదనం లేదు.

బద్ధకంగా వెలుగుతున్నాడు సూర్యుడు. అమ్మాయి కౌగిలింతలో వెచ్చదనమే ఆ ఎండలో వున్నది. ఉదయం పదకొండు గంటలు దాటినా కార్తీకమాసం చలి దూరంగా పరుగులు తీయలేదు.

"ఆకలవుతోంది" అన్నాడు ప్రకాశం- ఇందుమతి కళ్ళలోకి చూస్తూ-

"చపాతీలు పూర్తిగా అరిగిపోయినట్టేనా?" అన్నది ఆమె నవ్వి.

ట్రాన్సిస్టర్ ఆన్ చేశాడు నిరంజనం. ఏమీ రాలేదు. సన్నటి శబ్దం వచ్చింది.

ఆ ముగ్గురూ అరటితోటలో చెట్లకింద గళ్ళదుప్పటి మీద కూర్చున్నారు. వాళ్ళ ఎదురుగా పేకముక్కలు చిందర వందరగా పడి వున్నాయి.

ఒళ్ళు విరుచుకుంది ఇందుమతి.

"ఒకసారి గుళ్ళోకి వెళ్ళివద్దామా?" అన్నది ఆమె.

"నాకు ఆకలవుతోంది ఇందుమతీ" మళ్ళీ అన్నాడు ప్రకాశం.

"నిరంజనం ఆలోచనలు ఎక్కడో వున్నాయి" అన్నది ఆమె అతని కేసి చూసి.

"నీగురించే వాడి ఆలోచనలు" అన్నాడు ప్రకాశం.

వెంటనే నవ్వింది ఇందుమతి. నవ్వి "నువ్వు మాత్రం నా గురించి ఆలోచించటం లేదూ?" అన్నది.

"నీకు తెలియనిది ఏముంది ఇందుమతీ? ఇంతకీ ఎన్నాళ్ళీ ముసుగులో గుద్దులాట? ఈ సస్పెన్స్‌ను భరించ లేకుండా వున్నాను" అన్నాడు ప్రకాశం.

"తొందరపడకు ప్రకాశం. కాలమే అన్నీ నిర్ణయిస్తుంది. నేను ఎలాంటి స్థితిలో ఇరుక్కుపోయానో మీకు మాత్రం తెలీదా? నిజానికి నా స్థితిలో నువ్వుంటే ఏంచేసేవాడివి!"

ప్రకాశం మాట్లాడలేదు. నిరంజనం కళ్ళలోకి చూశాడు.

నిరంజనం పేకముక్కలతో మేడ కడుతున్నాడు.

"పేకమేడలు కట్టకు నిరంజనం. కూలిపోవచ్చు" అన్నది ఇందుమతి.

దెబ్బతిన్న వాడిలా ఆమె మొహంలోకి చూశాడు నిరంజనం.

ఆమె నవ్వలోంది.

"ఒక నిజం చెప్పాను. కంగారుపడకు" అన్నది నవ్వుతూనే.

"ఇప్పుడు నీకు ఎన్నేళ్ళు?" అన్నాడు ప్రకాశం.

"ఆడదాని వయసు అడక్కూడదు ప్రకాశం. నీకు తెలుసను కుంటాను"

"తెలుసు. ఈ సస్పెన్స్ తేలిపోయేసరికి నేను ముసలివాడినవు తానేమో"

"ఇది నిజమైన ప్రేమికుడు అనే మాట కాదనుకుంటాను"

"నాగుండెలు చీల్చిచూడు. అందులో నీమీద ప్రేమవుందో లేదో తెలుస్తుంది"

"వద్దు బాబూ. నాకు భయం. ప్లీజ్. ఇంకొంచెం కాలం ఓపిక పట్టు"

నిరంజనం అన్నాడు "ఇక మనం భోజనాలు మొదలుపెడదాం"

"అలాగే. నాక్కూడా ఆకలవుతోంది" అని కారియర్ బయటకు తీసింది ఇందుమతి ప్లాస్టిక్ బుట్టలోనించి.

ప్రకాశం మూడు అరిటాకులు కోశాడు.

"తోటమనిషి వస్తాడేమో" అన్నది ఇందుమతి.

"ఫర్వాలేదు. డబ్బులిద్దాం" అన్నాడు నిరంజనం.

"నీళ్ళు కావాలి"

నీళ్ళకోసం దగ్గరలోవున్న పెద్ద కాలవ దగ్గరకు వెళ్ళాడు ప్రకాశం.

ప్రకాశం అటు వెళ్ళగానే "నిరంజనం.... నా విషయంలో నీకు మాత్రం తొందరగా లేదూ?" అన్నది ఇందుమతి.

"ప్రకాశం బయటపడ్డాడు. నేను పడలేదు"

"సారీ నిరంజనం.... నిజానికి నాకూ తొందరగానే వుంది. కాని ఏంచెయ్యను? నా స్థితిచూస్తే నాకే జాలిగా వుంది. సాధారణంగా పెళ్ళికాని ఎంతమంది అమ్మాయిలు ఇలాంటి చిత్రమైన స్థితిలో చిక్కుకుంటారు? మీరిద్దరు....నేనొక్కదాన్ని....ఇద్దరిలో నేనెవరికి దక్కాలి? మైగాడ్.... చాలా చిత్రమైన పరిస్థితి."

ప్రకాశం నీళ్ళు తీసుకువచ్చారు.

మవునంగా తింటున్నారు ముగ్గురూ-

తోటపక్కనేవున్న గుడిలో సినిమా పాటలు వేస్తున్నారు. కార్తీకమాసంలో చివరి ఆదివారం కావటంతో ఆరోజు అక్కడకు చాల మంది వచ్చారు.

కాలవకి అవతలగావున్న గుడిమంటపంలో ఒకతను పెద్దగా పాటలు పాడుతున్నాడు. ఆపాట చిన్నగా గాలిలో తేలుతూ వాళ్ళను చేరుకుంటోన్నది.

"బాగా పాడుతున్నాడు" అన్నది ఇందుమతి.



"అతను నాకు తెలుసు. అతనికి ఒక చెయ్యిలేదు" అన్నాడు నిరంజనం.

భోజనాలయినాయి.

అరిటాకులను తోటలోనే దూరంగా విసిరేసింది ఇందుమతి.

ముగ్గురూ వక్కపొడి వేసుకున్నారు.

తోటలో ఏదో పేరు తెలీని పక్షి చిన్నగా అరుస్తోంది వుండి-వుండి.

సిగరెట్టు వెలిగించాడు నిరంజనం.

"ఎందుకూ సిగరెట్టు అలా తగలెయ్యటం? ఏమొస్తుంది?"అన్నది ఇందుమతి విసుగ్గా.

"కాల్చిచూడు. తెలుస్తుంది" అన్నాడు ప్రకాశం నవ్వుతూ.

"యూ డెవిల్. నేకెంత ధైర్యం" అన్నది.

"అందుకే నీకు తెలియని విషయాల గురించి నువ్వు మాట్లాడకు. ఎవరి శాటిస్ ఫాక్షన్ వాళ్ళది"

"గొప్ప ఫార్ములా" పేకముక్కలు కలుపుతూ అన్నది ఇందుమతి.

"మళ్ళీ ఆడదామా?" అడిగాడు నిరంజనం.

"ఇవాళ నీ హాండ్ రెయిజ్‌లో వుంది. ఇప్పటికే పది రూపాయలు కొట్టేశావ్ నాదగ్గర. ఆడదాని డబ్బు తీసుకుని మగాడు బాగుపడలేడు" అన్నది నవ్వుతూ-

"బాధపడకు. రాత్రి సెకండ్ షోకి ముగ్గురం సినిమాకు వెడదాం"

"థాంక్ యూ"

"నోమెన్షన్.... ముక్కలు పంచు"

గళ్ళదుప్పటి మీది మట్టిని దులిపి "ఈసారి గెలుపునాది" అన్నాడు ప్రకాశం.

"చూద్దాం" అన్నాడు నిరంజనం.

ఇంతలోనే రైలు వంతెనమీద నించి దబదబా చప్పుడు చేసు కుంటూ వెళ్ళిపోయింది.

పేకాడుతూనే ఆలోచిస్తోంది ఇందుమతి.

ఇంతకీ తను ఎదురుచూస్తున్న సంఘటన ఎప్పుడు జరుగుతోంది? ఆ ముహూర్తం ఎప్పుడు? అసలు ఆ సంఘటన జరుగుతుందా? జరగదా? ఏమో! ఎలా తెలుస్తుంది!

స్నేహమనే త్రిభుజానికి ఆ ముగ్గురూ మూడు కోణాల్లాంటివాళ్ళు. ఇందుమతి కోసం ఆ ఇద్దరూ ప్రాణాలివ్వటానికైనా సిద్ధంగా వున్నారు. ఆమెకీ ఆ ఇద్దరంటే గాఢమైన ప్రేమవుంది. కాని ఆ ఇద్దరిలో తను ఎవరికి చెందాలి? తను ఎవరి మనిషో తేల్చుకోలేకపోతున్నది ఆమె.

కాని ఇందుమతికో నమ్మకం. ఎప్పుడో వున్నట్టుండి ఏదో సంఘటన జరుగుతుందనీ- ఆ సంఘటన ద్వారా తను ఆ ఇద్దరిలో ఒకర్ని తన లైఫ్ పార్టనర్‌గా ఎన్నుకోగలదని-

ఇందుమతి అనుక్షణం ఆ తెలియని సంఘటన గురించే ఎదురు చూస్తోంది.

ఆ సంఘటన జరిగేదెప్పుడు?

నిరంజనం షో చూపించాడు.

ప్రకాశానికి కవుంట్ పడింది.

"ఈరోజు నిజంగా నీదే గెలుపు నిరంజం" అన్నది ఇందుమతి.

"థాంక్ యూ" అన్నాడు నిరంజనం.

ప్రకాశంకు పేకాడాలనిపించ లేదు.

కొంచెం దూరంలో వున్న కాలవమీది రైలువంతెనను చూశాడు. దానిమీద కొంతమంది చిన్నగా నడుస్తున్నారు.

"మనం కూడా ఆ ట్రాక్ మీదనించి కాలవ అవతలి వైపుకు వెళదామా?" అన్నాడు ప్రకాశం.

"వెడదాం.... నాకు ఆవైపుకు వెళ్ళి ఆగుడిని చూడాలని వుంది" అన్నది ఇందుమతి.

"వద్దు. ఆ ట్రాక్ నడవటానికి వీలుగాలేదు. దానిమీద నించి కిందపడితే చావటం ఖాయం" అన్నాడు నిరంజనం.

"నువ్వెప్పుడూ ఇంతే నిరంజనం. నీకు భయం ఎక్కువ. జీవితానికి డేరింగ్ ముఖ్యం. నేనున్నాను. లేచి నిలబడు"

"నాకు ఈతరాదు. మీరు వెళ్ళండి. నేను ఇక్కడే వుంటాను". అన్నాడు నిరంజనం.

"కాదు. నువ్వుకూడా రావాలి. ఆడది ఇందుమతి ధైర్యంగా వస్తుంటే నువ్వు రానంటావా? ప్లీజ్.... పద వెడదాం. చిన్నగా నడుద్దాం"

నిరంజనం బయల్దేరక తప్పలేదు.

తోటలోనించి ట్రాక్ దగ్గరకు వచ్చారు.

ముందు నలుగురు మనుషులు నడుస్తున్నారు చిన్నగా.

కింద కాలవలో నీళ్ళు నిండుగావుండి సుడులు తిరుగుతున్నాయి.

ఆ నీళ్ళను చూడగానే "వద్దు ప్రకాశం. నాకు భయంగావుంది" అన్నది ఆమె.

"యూ సిల్లీ.... పక్కన ఇద్దరు మగాళ్ళం వున్నాం. నువ్వు మధ్యలో వుండు" అన్నాడు ప్రకాశం.

ఇద్దరూ ఇందుమతి చేతులను పట్టుకున్నారు.

"జాగ్రత్త.... నీళ్ళు చూడకు" అన్నాడు నిరంజనం.

రైలుపట్టాల మధ్యవున్న సన్నటిరేకు తుప్పుపట్టి విరిగిపోయి వుంది.

చిన్నగా సగం దూరం నడిచారు ఇంతలోనే ఎదురునించి ఇద్దరు మనుషులు వచ్చారు.

పక్కకు తప్పుకుంది ఇందుమతి.

తప్పుకుంటూ కిందికి చూసింది. సుళ్ళు గిర్రున తిరుగుతున్నాయి. ఆమెకు వెంటనే కళ్ళు తిరిగాయి. తూలి వున్నట్టుండి వెనక్కు కాలవ లోకి పడిపోయింది.

అంతే- మరుక్షణం నిరంజనం- ప్రకాశం నీళ్ళలో వున్నారు

ప్రకాశానికి ఇందుమతి పమిట చేతికి దొరికింది. అతను ఆమె మునిగిపోకుండా గట్టిగా పట్టుకున్నాడు ఈదుతూ.

నిరంజనం నీళ్ళలో మునకలు వేస్తున్నాడు. ఎవరో నీళ్ళలోకి దూకారు. నిరంజనాన్ని ఒడ్డుకు లాక్కువచ్చారు.

ఆ ముగ్గురికీ స్పృహ లేదు.

* * * * *

మరురోజు ప్రకాశం- ఇందుమతి ఇంటికి వెళ్ళాడు. అతను వెళ్ళే సరికి ఇందుమతి మేడమీద గదిలో కూర్చుని టేప్ రికారర్‌లో పాట వింటోంది. ఆమె ముఖం బాగా అలసటగా వుంది.

ప్రకాశాన్ని చూసి "రా.... ఇలా కూర్చో" అన్నది.

"ఎలావుంది నీకు?" అడిగాడతను ఆమెను-

"బాగానే వుంది. కొంచెం అలసటగా వుంది. నువ్వెలా వున్నావ్?"

"క్షేమంగానే వున్నాను. నిరంజనంకూడా బాగానే వున్నాడు. కాని ఆ షాక్‌నించి ఇంకా పూర్తిగా కోలుకోలేదు"

"నేను చచ్చిపోయాననే అనుకున్నాను- నిజంగా నువ్వు వెంటనే నీళ్ళలోకి దూకి రక్షించకపోతే. మైగాడ్ తల్చుకుంటే పెర్రరు.... ఫియర్‌ఫుల్ ఇన్సిడెంట్.... థాంక్ యూ ప్రకాశం.... నన్ను బతికించావ్!"

"నో మెన్షన్ ఇందుమతీ.... నువ్వు కృతజ్ఞతలు చెప్పవలసిన అవసరం లేదు. ఇటీజ్ మై డ్యూటీ.... నా ఆరాధ్య దేవతవు నువ్వు" సంతోషంగా అన్నాడు ప్రకాశం.

ప్రకాశానికి నిజానికి ఎంతో సంతోషంగా వుంది. ఎన్నాళ్ళ నుంచో ఇందుమతి ఎదురుచూస్తున్న ఓ తెలియని వూహించని సంఘటన ఇంత హటాత్తుగా జరుగుతుందని అనుకోలేదు. ఈ గేమ్‌లో గెలుపు తనది. ప్రాణాలకు తెగించి తను ఇందుమతిని కాపాడుకున్నాడు. ఇప్పుడు ఇందుమతి దృష్టిలో తను అసలు హీరో.

"నీతో మాట్లాడాలి" అన్నాడు అతను.

"ఏమిటి ?"

"నువ్వు ఏన్నాళ్ళనించో ఎదురు చూస్తున్న సంఘటన జరిగిందనుకుంటాను. ఈ సంఘటన ద్వారా నువ్వు మా యిద్దరిలో ఎవరికి చెందాలో నిర్ణయించుకున్నావని అనుకుంటున్నాను"

"అవును ప్రకాశం.... నేను ఎదురుచూసిన సంఘటన జరిగినందుకు సంతోషంగానే వుంది కానీ ఆ సంఘటన ఇలాంటి విషాదమైనది కావటం విషాదం"

"అవును. ఐ టూ ఫీల్"

"ఏమయినా నా సమస్య తేలిపోయింది. నాక్కావలసిన మనిషి ఎవరో నేను తెలుసుకోగలిగాను".

"ఎవరా అదృష్టవంతుడు?"

"నిరంజనం" ఇందుమతి- ప్రకాశం కళ్ళలోకి చూస్తూ అన్నది.

"నిజమా!.... ప్లీజ్.... జోక్ చెయ్యకు ఇందుమతీ. నేను తట్టుకోలేను"

"ఇందులో జోక్ లేదు ప్రకాశం.... ఇది నూటికి నూరుపాళ్ళు నిజం"

"ఇది అన్యాయం" ఆవేశంగా అన్నాడు అతను.

"కాదు. నాదృష్టిలో న్యాయం"

ఇందుమతికి మతిపోలేదుకదా అనుకున్నాడు ప్రకాశం. నిజానికి తను ప్రాణాలకు సయితం తెగించి ఆమెను రక్షించాడు. ఈ విజయం తనది. ఇందుమతి- నిరంజనానికి ఎలా దక్కుతుంది?

"నీ ఆలోచనలను నేను చదవగలను ప్రకాశం. నిజమే. నువ్వు నీ ప్రాణాలకు తెగించి నన్ను రక్షించావు. నీకు ఈతవచ్చు. ఆ ధైర్యంతోనే నువ్వు నీళ్ళలోకి దూకావు. కాని ఈతరాని నిరంజనం కూడా నీళ్ళలో పడ్డాడు. ఎలా పడ్డాడంటావ్?" అతని కళ్ళలోకి చూసింది ఇందుమతి.

క్షణం తర్వాత ప్రకాశం ఆ గదిలో లేడు.

*

(మార్చి '81 ప్రభవ - మాసపత్రిక)